కథానిక

# పెడ అర్థాలు

శ్రీ కందుకూరి లింగరాజు

రామయ్యపంతులు ఒక్కసారి ఊపిరినిండా గాలి తీసుకున్నాడు. అందులో తృప్తి నిండింది. ఇన్నాళ్లు తిరిగిన శ్రమ, పడ్డ ఆవేదన అఖరైందన్న భావనా కల్గింది.

ఈ కుర్చీలో కూర్చుంటే, వెనక కొద్దినెలల నుండి తను కూతురు పెళ్లికి తిరిగినశ్రమ, ఖర్చుపెట్టినడబ్బు ఆఖరుగా పెళ్లి అమాంబాపతు అయిన ఏడువేల రూపాయిలు అన్నీ తిరుగుతాయి. పెళ్లికొడుక్కు ఆస్తివుంది, చదువువుంద తండ్రి మంచి పేరుప్రతిష్ఠలు ఉన్న వ్యక్తి అనే, అన్ని జిల్లాలు దాటినా ఆ సంబంధం నిర్ణయించుకున్నాడు. జిల్లాలు భేదంతో, ఆచారాలు భాషలూమారినా, భావిలో సుఖంగా వుంటుందన్న ధైర్యంలోనే నిశ్చయించేసేడు. ఇంట్లో మంగమ్మ మొదట్లో కొస్త జంకు చూపించింది. వాళ్ల ఇల్లు, ఫౌజు, డబ్బుసంగతి చెప్పినపుడు, ఇంకేమనలేకనే, ఇప్పటికైనా అల్లుణ్ణి ఓవాడిని సంపాదించుకున్నానని అనువయం చేసుకుంది.

సాటివారు! "అంత దూరం సంబంధం చేసేరు. అమ్మాయి ఏం కష్టపడుతుందో" అన్న అధైర్యం పోసేసరికి, కొంచెం బెంగపెట్టుకున్నా మన గుడుపులకు వచ్చినపుడు, అల్లుడి విషయంలో, ఏవిధమైన విచిత్రఆలోచనలు పెట్టుకోవడం గాలిలో మేడలు అనుకుంది దాంతో అమ్మాయిని పువ్వుల్లో పెట్టుకునే పూజిస్తాడన్న ధైర్యం కల్గింది.

ఇప్పుడు, కూతురులేని ఇల్లు చూస్తుంటే, చాలా బాధగానే వుంది రోజూ ఏదో అల్లరి చేస్తూ, కేకలు వేస్తూవుండే సుందరి లేకపోవడం, చీకటిగదిలో కూర్చోపెట్టినట్టే వుంది. విస్తరి దగ్గరకూర్చున్నపుడు ఆయనా తనూ కూడా బెంబేలుపడిపోయి, సుందరికబుర్లు రుద్ధంగానే చెప్పుకోవడంతో సరిపోయేది.

రోజూతారీఖులు చూచేది. సుందరి వెళ్లి అప్పుడే మూడునెలలు అవవస్తోంది. వెళ్లేముందు, 'అమ్మ, నీకు మూడురోజులకోసారి ఉత్తరం వ్రాస్తా' అని వాగ్దానం ఇచ్చి వెళ్లింది. మూడురోజులకి ఆమొదట్లో ఉత్తరాలు వచ్చేవి. కాని నెలా అయ్యేసరికి ఆవుత్తరాలు కరువైయ్యేవి. ఒకటి రెండుసార్లు తను వ్రాసింది; 'అమ్మని మర్చిపోయేవా? అని. ఏదో వేళాకోళంగానే సమాధానమిచ్చేది ఆ ఉత్తరాల్లో అల్లుడు ఏదోఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడని, అది తప్పక అవుతుందని ఉండడంతో మురిసింది అల్లుడూ కూతురూ వేరుగా కాపరం పెడతారు అనేసరికి తన మొట్టమొదటి రోజులు జ్ఞాపకం వచ్చింది. అందులోవున్న మాధుర్యం, స్వేచ్ఛ; తను మొదట వేరుపడిన వయస్సు కన్న, చిన్నవయస్సులోనే వెళ్లడం, సంతోషం కల్గించింది.

ఆరాత్రి అయనా, ఆవిడాకూడా ఎన్నో విషయాలు జ్ఞాపకం చేసుకున్నారు. అన్నిట్లలోనూ సుందరిని గూర్చి, అల్లుణ్ణి గూర్చి మాటలు ఒచ్చేయి. వేరుసంసారానికి కావలసిన సారె అంతా ఏమేమో ఏ కరవు పెట్టింది. గోద్రెజ్ ఇనప బీరువా, స్ప్రింగ్ మంచాలు, టేబిల్ కుర్చీలు, రెండుసోఫాలు .వగైరాలన్నీ ఆర్డరు ఇవ్వండి అని చెప్పింది ఆయనా 'అలాగే' అంటే, వయస్సువచ్చిన కళ్లల్లోంచి, క్షణికం ...హాయలు మైకంలోంచే నవ్వుకున్నారు.

...క వాళ్లిద్దరూ, రోజూ పోస్టుకోసం ...చూడడంతోనే సరిపోయింది. ఈరోజు, ...వాళ్, తప్పక ఒచ్చి తీరుతుంది అన్న ...లోనే ఎదురుచూచి, లేకపోవడంతో, రేపు' అన్న వాయిదా వేసుకునేవారు.

ఈ ఎదురుచూడడం, ఉత్తరం రాకపోవడంతో, రామయ్యపంతులుకు చికాకు కల్గింది. తను అల్లుణ్ణి చివాట్లు వేసేంత చనువు రానే లేదు. సుందర్ని ఏమైనా అందామా అన్న, ఒక్కరై మొట్ట మొదటిసారి వెళ్లింది. ఏం కించపడుతుందో అన్న అధైర్యంలో వ్రాయలేక పోయేడు.

అనకోకుండానే, ఆ రోజు ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది. మామూలుగావస్తే ఖంగారు పడక పోవును. ఖంగారుగానే ఉత్తరం చింపేడు మంగమ్మ ఆదుర్దా పడింది. చదివేసరికి ఓక్క చచ్చిపోయేడు ఒక్కసారిగా చచ్చిపోయిన తాతముత్తాతల ప్రతిష్ఠ, తండ్రి గౌరవం మంట కలసిపోయింది అనే బాధ మొఖంమీద ఆవరించింది.

ఆయన అల్లాడేలా అవడంతో మంగమ్మ గుబగుబా అయ్యింది ఆదుర్దాతోటే "ఏమిటండీ? అమ్మాయీ అల్లుడూ కులాసా? ఎక్కడనుండండీ? ఆవరసలో ప్రశ్నలు వేసింది

పరవూ మర్యాదా, పోయినట్టే బాధలో ద్యోతకమైన మొఖంతోనే ఉత్తరం చేతికందిచ్చేడు. ఆవిడా మాట్లాడకుండానే తీసుకుని, కళ్లు చికిలించుకుంటూనే "అమ్మాయిగారు మొన్న దొరతో లేచిపోయేరు పాణిగ్రాహి" ఒళ్లు జీవచ్ఛవమే అయి "లేచిపోయింది" అని అనకుంటూనే గుమ్మానికి చేర్లపడింది.

'దొరగారితో లేచిపోయింది' అనేసరికి రామయ్యపంతులికి వియ్యంకుడి ఇంటిప్రక్కగా ఉన్న "రోజర్ దొర" జ్ఞాపకం వచ్చేడు. అక్కడ తను ఉన్న రోజుల్లో, రోజూ ఉదయం, సాయంత్రం, అమ్మాయి అల్లుడూ వెళ్లడం, కాఫీలు పుచ్చుకోవడం, సినిమాలకు వెళ్లడంకూడా జరిగింది పంతులు అంతవరకూ దొర చాలా మంచివాడనే అనకున్నాడు. ఇక్కడకు వచ్చినతర్వాత రెండుసార్లు ఉత్తరం కూడా వ్రాసేడు ఇప్పుడు ఎంత దుర్మార్గపు పనిచేసేడు అన్న కోపం వచ్చింది "అమాయకురాల్ని అందంగా వుందని, చనువుగా తిరుగుతోందని చూచి సుందర్ని లేవతీసుకుపోయేడా? వాణ్ణి పట్టుకుని." పళ్లు పటపటా కొరుకున్నాడు.

క్షణికం మంచిఅంతస్సు 'నీ పోలికేనోయ్' అని జ్ఞాపకం చేస్తే ఉలికిపోయేడు. వనక జీవితంలో. ప్రక్క ఆచారిగారి పెళ్లాంతో తనూ రాకంధాయనం ఎదురుగా తిరిగింది దానికితోడు తర్వాత తనలో రహస్యంగా దాచుకున్న ఇతర స్త్రీలు జ్ఞాపకం వచ్చింది

ఈ పోలికను తను ఒప్పుకోలేకపోయేడు; అందులోనూ కూతుర్కి ఒచ్చిందంటే ఎంత విచ్చలవిడిగావున్నా తను భార్యయెడల సత్యవ్రతుడులాగే వున్నాడు తన పోలిక ఎల్లా వస్తుందీ?' అది అసందర్భంగా కనపిస్తోంది ప్లీడరు తన కేసును సమర్థించుకున్నట్లే వాదన సమంజసంగా కనపడింది

కాని ఒక్కటి క్రొత్తలో తన భార్యని గూర్చి ఎవేవో విన్నాడు ఏదో కొంటెపని చేస్తే ఓ వెయ్యిరూపాయిలు ఎక్కువపెట్టి సంబంధం చేసేసేడు ఖంగారుగా మంగమ్మవల్లే తన పరువు, ప్రతిష్ఠ, మర్యాద మంట కలిసిపోయిందని కోపం, ఉక్కు రోషంకూడా వచ్చేయి.

ఎందుకు ఇల్లాంటిదాన్ని పెళ్లాడేనా అని. ఇరవై సంవత్సరాలు కాపురంచేసినా, విసుక్కుని నిరాశ చెందేడు

గడియారం, పదకొండు కొట్టడంచూచి, ఖంగారుగానే లేచి, ఓ చిన్న సూటుకేసులో కావలసిన బట్టలు వేసుకుని, ఉడుకూ మడుతూనే రెండు మెతుకులు కొరికేడు రైలు స్టేషనుకు వచ్చి 'బరంపురం' టిక్కట్టు కొన్నాడు. బండి కదలిందగ్గరనండి, ఏవేవో ఆలోచనలు వచ్చేయి తను ఏవిధంగా తలెత్తుకుని ఆ వియ్యంకుడి మొఖం చూడడమో బోధపడింది కాదు. అల్లుణ్ణి ఏవిధంగా పరామర్శించాలి " పెళ్లాల్ని చెప్పుచేతల్లో ఉంచుకోలేని ఇల్లాంటి వ్యక్తుల్ని చూస్తే నవ్వు వచ్చింది కూడాను.

స్టేషన్లో దిగి, వియ్యంకుడి ఇంటికి బండిలో వెళ్లేటప్పుడు ఎరుగున్నవారు ఎవరైనా చూస్తారేమో అని చాటుగానే ముఖంపెట్టి వెళ్లేడు.

సందుమలుపులో వుండగా బండిలోంచి రోజర్సు ఇల్లు చూచేడు. తలుపులు తాళాలువేసి ఉండడం చూచి, తల కట్టినట్టే మనస్సు విరిగింది "దొంగ " తర్వాత వాక్యం నోట్లోనే అణగిపోయింది.

ఏమిటూ బండి ఆ గిందని వియ్యంకుడు బయటకు వచ్చేడు చిక్కి శల్యం అయినట్టే పంతులు బాడి దిగేడు "ఓహో, బావగారా! రండి రండి!" నవ్వుతూ అంటూనే ఆయన ఆహ్వానం పంపేరు.

కుర్చీలో కూర్చుంటుండగానే "అంతా క్షేమమా! ఓరే పాణీ! కాఫీ తీసుకురా!" ఆయన కేక వేసేడు

పంతులుకు అర్థం కావటం లేదు. ఇదంతా తన్ని న్యూనత పంచడానికి చేసే విపరీత మర్యాదా అని అనుకున్నాడు; కుళ్లిపోయేడు.

"బావగారు! పాణి ఉత్తరం వ్రాయలేదూ మీకు...?" ఏం చెప్పాలో తెలియక బాధపడ్డాడు.

కాఫీ తీసుకువచ్చిన పాణితో "పాణీ! బావగారికి ఉత్తరం వ్రాయలేదూ?"

"వ్రాసేనండి" దొరగారితో అమ్మాయిగారు లేచిపోయిందని."

ఆ వాక్యం ములుకుల్లా తడితే, కాఫీ గొంతుకలోనే కొట్లాడింది పంతులుకు వియ్యంకుడు యథాలాపంలోనే తీసుకుని" అబ్బాయికి కలకత్తా తాతా కంపెనీలో ఉద్యోగం అయ్యింది. కోడలు వాడు మొన్న మెయిల్‌కు వెళ్ళేరు" అన్నాడు

"ఆ!" అదైనా నోటమ్మట తెలియకుండానే వచ్చింది

మర్నాడు తిరిగి బందరు బయల్దేరేడు. మధ్యలో విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా...మూడు జిల్లాలు దాటడం చూచేడు. 'జిల్లాలు దాటితే ఇల్లాంటి విపరీత అర్థాలమాటలు ఒస్తాయి' అని అంతస్సు చెపితే...ఉరుకులు రుకుల్కంటూనే ఇంటికి వచ్చి మంగమ్మని దగ్గరసా తీసుకుంటూనే చెవులో అన్నాడు

ఆవిడా కరగిపోయి "ఇదా" అంటూనే భుజాలమీద గునిసింది

---

కథానిక:

# అటూ - ఇటూ

మూలం: భగవతీచరణవర్మ

అనువాదం: ఆనందమూర్తి

బంగాళా వరండాలో సుకుమారుడు కుర్చీమీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు ఆలోచినూ ఆలోచిస్తూ ఒక సిగరెట్టు ముట్టించి రెండు గుక్కలు పట్టేడు ఈలోగా వెనకనుంచి పేపరుపడ్డ చప్పుడైంది గభీమని లేచి పేపరు చేత తీసుకున్నాడు. ఆ వేళ పేపరులో పడ్డాయి ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న పరీక్షా ఫలితాలు. సిగరెట్టు అవతల పారేసి ఆతురతతో తన నెంబరు ఫస్టుక్లాసులో ఉండడంచూసి పరవశుడైనాడు. సుకుమారుడు యిప్పుడు ఎం ఏ మొదటి తరగతిలో కృతార్థుడైనాడు. ఆ తన్మయత్వంలో "నేను" అనుకొన్నాడు. తన అస్తిత్వాన్ని గుర్తించాడు సుకుమారుడు. ఈ ప్రకృతిలో ఎటు చూచినా తనే కనబడ్డాడు తనకు. ప్రకృతిలో తను, తనలో ప్రకృతి! ఆ ప్రకృతికూడ యీతని పారవశ్యాన్ని పంచుకుంటోంది వాకిలిముందున్న మామిళ్ళమీదనుండి కోవెల లొక్కమారు కిలకిలమన్నాయి. కూయని కూతలు పెడుతూ రెక్కలు విదుల్చుకొని ఒకపిట్ట గూటిలోంచి విశాలాకాశంలోకి వింతలు చూచేందుకు ఎగిరిపోయింది ఉద్యానవనంలోకి లతల ఆకుల చాటుమాటున అణగి మణగిఉన్న పువ్వుగుచ్ఛాలు ఒక్కమారుగ వికసించి సువాసనలు వెదజల్లుతూ తమ ఉనికి వ్యక్తపరచుకొన్నాయి మీ కోసరమే కాచుకొన్నామన్నట్లుగా కొదమ తుమ్మెదలగుంపు ఒక్కమారుగా వాటిమీది కురికి ఆనందంతో ఆమకరందమాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నై.

సుకుమారుడు ఆనందపరవశుడై తన్నుతాను మరచి తనతో సహకరిస్తున్న ఆ ప్రకృతిలో లీనమయ్యాడు.

తనని తాను గుర్తించుకొనేటప్పటికి సుకుమారుడు బంగళాదాటి చాలాదూరం వచ్చేశు. అనుకోకుండా అప్రయత్నంగా లాల్చీ జేబులోంచి ఒక కవరు తీసేడు ఉత్తరం చదవడం మొదలెట్టాడు. అది ఆ రోజుకి మూడోసారి! తనను ప్రేమిస్తున్న శాంత వ్రాసిన ఉత్తరాన్ని మళ్లా చదవ నారంభించాడు. ఆ గుండ్రని ముత్యాలవంటి దస్తూరిచూసి ముగ్ధుడై మురిసిపోయ్యేడు శాంత తన్ను ప్రేమిస్తున్నది ఆ ప్రేమలేఖలో అక్షరక్షరంలో సుకుమారునికి శాంతమూర్తి సాక్షాత్కరించింది ఆ లేఖ నొక్కమారు హృదయానికి చేర్చుకొన్నాడు. సుకుమారుడు తన హృదయవీణను ఒకమారు మీటి చూచుకొన్నాడు. అన్ని తంత్రులు శాంత! శాంత! అని ప్రతిధ్వనించినవి! సుకుమారుని హృదయవీణానినాదానికి శ్రుతిస్వరంగా వాళ్ల నాన్నగారి మాటలు స్ఫురణ కొచ్చాయి. "నాయనా! ఎం ఏ. మొదటితరగతిలో కృతార్థుడవైతే ఐసియస్‌కి యింగ్లండు పంపుతాను"...

నాన్నగారు నన్ను యింగ్లండు పంపుతారు. శాంత నన్ను ప్రేమిస్తోంది కాలేజిలో విద్యార్థులందరూ శాంతను ప్రేమించి ఆమెను బడసేందుకు ప్రయత్నిస్తున్నారు కాని శాంత వాళ్లనందరినీ కాదని నన్ను వరిస్తోంది .

సుకుమారునిహృదయం పొంగిపోయింది. ఒడలు పులకరించినవి గృహోన్ముఖుడైనాడు.

మార్గమధ్యంలో జనసమూహం. కోలాహలం అవ్యక్తానందపారవశ్యంతో సుకుమారుడా జనసమూహాన్ని సమీపింపబోతున్నారు. సమూహం దగ్గరి కొచ్చింది! అందుండి స్వతంత్ర నినాదాలు సుకుమారుని చెవికి పినిపించినై. సుకుమారునిలో ఏదో నూతన చైతన్యం కలిగింది. లాటీలు - ఖద్దరుటోపీలు కనబడ్డవి. సుకుమారుడు ఆ జనసమూహంలో కలిసిపోయినాడు. "స్వతంత్ర భారతకి జై" అంటూ జెండానెత్తి సమూహం ముందు కొచ్చాడు.

ఎగురగా పరప్రభుత్వపు సేనాబలగం వస్తోంది. ఎఱ్ఱటోపీలు! కొద్ది క్షణాలలో... "ఈ సభ అశాస్త్రీయమైనది. రెండునిమిషాలలో చెదరిపోండి. పోకుంటే లాటీదెబ్బలకు - తుపాకి కాల్పులకు గురికాగలరు పొండి! పొండి!! పొండి!!!"— హెచ్చరించాడు అశ్వారూఢుడైన పోలీసు సూపరింటెండెంటు.

జనసమూహంలో కొంత అలజడి కలిగింది ఈ లోగా సమూహమధ్యంలోంచి "ఆగండి - నిలవండి - స్వతంత్ర భారత్‌కి జై" అని ఒక పురుషస్వరం!! వెంటనే ఒకతుపాకి కాల్పు!!

గుండు సుకుమారుని గుండెలు చీల్చుకు పోయింది!!!

తరుణవయస్కుడు, అందగాడు, ఉత్సాహపూరితుడు- సుకుమారుడు - నవ్వుతూ నేల కొరగినాడు;

ఏ పరలోక స్వర్గాన్ని-ఏ కల్పనా స్వర్గాన్ని అపేక్షించి యీ యిహలోక స్వర్గాన్ని వదులుకొన్నాడు యీ యువకుడు ???

* * *

త్రివేణీ సంగమస్థలంలో కుంభమేళానికి జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆసేతు హిమాచలంనుండి జనం ఆనాటి ఉత్సవాన్ని దర్శించడానికి - పుణ్యం సముపార్జించడానికి తండోప తండాలుగా వస్తున్నారు. దేవాలయ ప్రాకారంలో గంటలు మ్రోగుతున్నయి. లోపల నైవేద్యాలు జరుగుతున్నయి. ఉత్సవ ఊరేగింపు కొద్ది సేపటిలో వస్తుంది సమూహం క్రిక్కిరిసి

(18-వ పేజీ చూడుడు)

# దక్షిణదేశ దేవాలయాలు

(10-పేజీ తరువాయి)

ఈ దేవతావిగ్రహపు స్వభావమునుబట్టి దీనికి యోగ, భోగ, వీరములను మూడు భేదములచే మూడు రూపము లేర్పడుచున్నవి. యోగవిష్ణు విగ్రహము సాధారణముగా జనపదస్థలములకు చాలాదూరముగా నిర్మానుష్యమయిన సుందర ప్రదేశములలో ప్రతిష్ఠింపబడును. యోగీశ్వరుడు కాగోరి యోగవిష్ణువు నారాధించు భక్తుడు నిశ్చలముగా, నిరుపద్రవముగా తపస్సు చేసికొనుటకు అట్టి ప్రదేశములే తగినవి గనుక యోగవిష్ణు దేవాలయము లట్టి ప్రదేశములందు నిర్మింపబడుచున్నవి.

భోగవిష్ణుదేవాలయములు సాధారణముగా జనసమ్మర్ద ప్రదేశములందే అనగా గ్రామములందును, నగరములందును, నెలకొల్పబడుచున్నవి. మహావిష్ణువు అవతారభేదముల విగ్రహములతో ననేక దేవాలయములు జనసమ్మర్ద ప్రదేశములందే వెలసియున్నవి. ఈ భోగవిష్ణువు, భక్తాభీష్ట ప్రదుడు. సర్వజనప్రియుడు. మహావిష్ణువు మఱియొక రూపభేదము వీర విష్ణువు. ఇతడు సత్యసంపదను, యుద్ధ విజయమును నొసగునని రాజులు, వీరులు మొదలగు వారీ రూపమునందే మహావిష్ణువు నారాధింతురు. వీర నరసింహ, ఉగ్రనరసింహ, దేవాలయము లిట్టివే. ఈ దేవాలయములు సాధారణముగా నగరములకు వెలుపల నిర్మింపబడుచున్నవి. ఇవికాక అభిచారిక దైవములని పేర్కొనబడు క్షుద్రదైవతముల ప్రతిష్ఠించిన దేవాలయములు మహారణ్యమధ్యములందును, కొండలోయలయందును, నిర్మింపబడుచున్నవి. ఇట్లు ఆయాదేవుల స్వరూప స్వభావ భేదములనుబట్టి వివిధస్థలములలో నాయా దైవములకు దేవాలయములు నిర్మింపబడుచున్నవి.

దేవాలయ నివేశన విషయమునకు వలెనే మన పూర్వులు ఆయా నివేశనస్థలముల యందలి మృద్భేదమునకును సమాన ప్రాముఖ్యమును చూపిచుండిరి. తెలుపురంగు నేల బ్రాహ్మణ దైవములకును, పసుపురంగు నేల క్షత్రియదైవములకును, ఎఱుపురంగు నేల వైశ్యులకును, నల్లరంగు నేల శూద్రులకును శ్రేష్ఠములని చెప్పబడుచున్నది. ప్రాచీన శిల్పశాస్త్రములలో దేవాలయ నిర్మాణసందర్భమున నేల వాసనకూడ పరిగణింపవలయునని చెప్పబడి యున్నది. బ్రాహ్మణ దైవములకు మన్ను తియ్యగను, నీరు నేయివలెను నున్న నేల శ్రేష్ఠమనియు, క్షత్రియ దైవములకు రక్తవర్ణముగల చిక్కని ధాతువులతోడి నేలయు, వైశ్యులకు మిక్కిలి తెల్లనైన నేలయు, శూద్రులకు దుర్వాసనకల నేలయు శ్రేష్ఠములని చెప్పబడుచున్నది. ఈ వివరములను బట్టి ప్రాచీన శిల్పశాస్త్రజ్ఞులు, దేవాలయ నిర్మాణ కర్మఠులు దేవాలయములను నిర్మించు సందర్భమున నాయా భేదములను బట్టి తత్తదర్హ నివేశన స్థలముల నెన్నుకొనుటయం దెంతో జాగరూకులయి యుండిరనియు, దమ యిచ్చవచ్చిన చోట దమ యిచ్చకు వచ్చిన దైవముల ప్రతిష్ఠించి దేవాలయముల నెలకొలుపలే దనియు తెలియుచున్నది.

దక్షిణదేశములో సాధారణముగా నన్ని దేవాలయముల యందును దేవాలయ నిర్మాణ పద్ధతి, దేవాలయ స్వరూపము ఒక్కటిగానే గోచరించుచున్నది. దేవాలయ నిర్మాణములలో ప్రధానములయినవి కొన్ని యిందు పేర్కొనబడుచున్నవి.

1. గర్భగృహము - ఇందు మూలవిరాట్టు ప్రతిష్ఠింపబడును. ఈ గర్భగృహమునకు మీద నొక విమాన ముండును. ఈ గర్భగృహమునందలి మూలవిరాట్టున కెదుట 'ముఖమండప' ముండును. ఇందు ఉత్సవ విగ్రహములను వేంచేపు చేయించి పూజాదికములు, అభిషేకములు జరుపుదురు. ఈ ముఖమండపమున కిరువైపులను ద్వారపాలకులుందురు. ఈ ద్వారపాలక విగ్రహములకు ముందువైపున మహామండపము లేక అర్ధమండపము అని పిలువబడు నొక పెద్ద మండప ముండును. ఈ మండపమునందే వాహనాదులను తెచ్చి యుత్సవకాలములందు అలంకరింతురు. ఈ యర్ధ మండపమున కెట్టయెదుట ధ్వజస్తంభమును, బలిపీఠమును నుండును. ఇట్టి విభాగములతో రూపొందిన దేవాలయమునకు జుట్టును గట్టి రాతిగోడలతో ప్రాకార ముండును. ఈ ప్రాకారముఖమునందు ఒకటిగాని, యంతకింక నెక్కువగా గాని గోపురములు కట్టుదురు. దేవాలయములకు వెలుపలను లోపలను గూడ పుష్కరిణులు అని పిలువబడు జలాశయము లుండును. ఆ పుష్కరిణుల యందు స్నానముచేయుట యతి పవిత్రముగా నెంచబడుచున్నది. మూల విరాట్టును వెలయించిన గర్భగృహమునకు చుట్టును చిల్లరదైవములకును మతాచార్యులకును గట్టబడిన చిన్న చిన్న దేవాలయము లుండును. పెద్దపెద్ద దేవాలయములయం దింకను గొప్పగా కాశావిన్యాసము ప్రక్కలించు శిల్ప ఖండములు కనువిందు గొలుపుచుండును. శ్రీరంగములోని రంగనాథస్వామి దేవాలయమున కేడు పెద్ద ప్రాకారములు కలవు. తత్ప్రాకార కుడ్యాంతర్భాగముననే రంగనగరము వెలయుచున్నది. ఆముక్తమాల్యదలోని శ్రీరంగనాథస్వామికి గల యేడుప్రాకారముల వర్ణన మిది చూడుడు—

చని కాంచె న్విరజాభిధాంతిరుపు
స్నహోద్యద్భవాతీర నం
దనవాటీ వలయద్రుమావళి దళాం
తర్దృశ్య పాపాళి భం
జన చాంపేయసుమాయమాన విషమ
స్వర్ణావృతి వ్రాత ర
శ్మి నభస్స్పృక్శిఖరాళి దీపకళికా
శృంగంబు శ్రీరంగమున్.

ఆముక్తమాల్యద. ఆ. 7. ప 27.

దక్షిణ దేశములోని ప్రాచీన దేవాలయ శిల్పము మహోన్నతమై, మహా వైభవోపేతమై, చిత్ర చిత్రశిల్పఖండ మండితమై యాయా దేవాలయములలోని దైవముల నారాధించు భక్తాగ్రగణ్యులకు, ప్రజలకు భక్తిగుణమును ప్రజ్వలింప జేయుచున్నది. మహోన్నత దేవాలయ గోపురశిఖరమును దలయెత్తి చూచిన ప్రతి హైందవుడును, నా దేవాలయశిల్పమునకు దల యొగ్గి వినమ్రుడై నమస్కరించి భక్తి గౌరవములతో దత్కళా వైదగ్ధ్యము నగ్గింపక మానడు. ఈ దేవాలయములు సంస్కృతి నిలయములై విద్యాతీర్థములై వెలసి నేటి భవన నిర్మాణసాధనములు లేని యా ప్రాచీన కాలముననే మనవారు అనవరతతపస్సాధ్యమయిన యుత్తమ శిల్పకళను వెలయించి యెట్టి మహోన్నత శిల్ప కళాఖండముల వెలయించిరో యూహింప జేయుచున్నవి. 'క్రొత్త యొక వింత ప్రాత రోత' అని తలపబడుచున్న యీ కాలమున గూడ నీ దేవాలయములు మహోన్నత శిల్పకళానైపుణ్యము వెలయుటచేత ప్రత్యేక శిల్ప గౌరవము పడసియున్నవి. మన ప్రాచీన శిల్పకళావేత్తల కళావైదగ్ధ్యము, నిర్మితసామర్థ్యము అట్టివి! ఈ కాలమునకే కాదు ఏకాలమునకు గూడ నివి జగాదిప్వటీలై విశ్వమెల్ల వెలుగులు వెదజల్ల గలవు.

దక్షిణ దేశములోని కొన్ని దేవాలయములు పూజా స్థలములుగా మాత్రమేగాక ప్రసిద్ధ గురుకులములుగను, విశ్వ విద్యాలయములుగనుగూడ వెలసినవి. చిదంబరము, కంచి మొదలగు స్థలములలోని దేవాలయములలో ప్రాకారముల నంటి విద్యామండపములు నిర్మింపబడియున్నవి. అవి విద్యార్థులు, ఆచార్యులు కూర్చుండి పాఠప్రవచనముల చేయుట కనువుగా నున్నవి. ఈ విద్యాసంస్థలు, గురుకులములు మహారాజులచే పోషింపబడుచుండినవి. అందు విద్యాభ్యాసము చేయు విద్యార్థులకు విద్యాసౌకర్యముతోబాటు ఉచితముగా భోజనాదివసతులు కల్పింపబడుచుండెను.

కొన్నిచోట్ల దేవాలయములు రక్షణస్థలములుగా గూడ వెలయుచుండినవి. రాజ్యములో నంతఃకలహములు అల్లకల్లోలములు, అరాచకములు చెలరేగినపుడు ప్రజలు దేవాలయములలో దాగుకొని తమ్ము, తమ ధనసంచయమును గాపాడుకొనుచుండిరి. ఇందు కొఱకై యీ దేవాలయములలో 'నేలమాళిగ'లు కూడ నిర్మింపబడుచుండెను. ఆపత్సమయములందు ఈ నేలమాళిగలలో ప్రధానదేవ విగ్రహములను దేవధనమును దాచుచుండిరి. ఈ దేవాలయముల చుట్టును బజారులు గ్రామములు ఏర్పడినవి. ఆ ప్రదేశమునకు చుట్టుప్రక్కల నుత్పత్తియగు పదార్థములు బజారులలో నమ్మకము చేయుచుండిరి. ఉత్సవసమయములందు చుట్టుప్రక్కలనున్న పల్లీయులు, గ్రామీణులు ఈ దేవాలయ ప్రదేశములయందు జేరి యచట తమ నిత్యావసర పదార్థముల కొనుగోలు చేయుటమాత్రమే గాక బంధుమిత్ర సందర్శనములకు, నూతన పరిచయములకు నది పదవ కాశము కనుక యిచ్చటనే పెండ్లి సంబంధములు కుదుర్చుకొని పెండ్లి బేరములుకూడ సాగించుచుండిరి. ఈ తీరున ప్రధాన దేవాలయములలో నేటికిని జరుగు వివాహసంప్రదాయ మేర్పడి పరంపరగా సంప్రదాయముక్రింద చెల్లుబడి యగుచున్నది.

ఇట్లు దేవాలయములు పూజాస్థలములు మాత్రమే గాక విద్యా సంస్కృతులకును ప్రధానకేంద్రములై వ్యాపారమునకు, సాంఘిక శుభకార్యావసరములకు మంగళ నిలయములై, ప్రజాసామాన్యమునకు మహోపకారములై విలసిల్లుచు తత్తద్దేవాలయనిర్మాణము గావించిన మహనీయుల పవిత్ర సంకల్పములకు బ్రబల తార్కాణములై వెలయుచున్నవి!

# అటూ - ఇటూ

( 11-వ పేజీ తరువాయి)

ఉంది. పిల్లలు - పెద్దలు - వృద్ధులు-యువకులు - స్త్రీలు - మానవప్రపంచమంతా అక్కడే వుంది.

అరహదారికి ఒక ప్రక్కగా ఒక వికలాంగుడు - ముదుసలి - కుష్ఠువ్యాధి పీడితుడు - పీలిక పేలికలతో దిగంబరుడై - చలికి వడవడ వడుకుతూ కూర్చున్నాడు. ఒడలంతయు కుష్ఠము! అంగము లన్నియు వికృతములైనవి. శరీరమంతా పుండ్లతో రసిగారుతూ బొమికలగూడుగా నున్నాడా ముదుసలి! ఉదరము వెన్నునంటినది. ఆ జనసమూహం వైపు చూస్తూ వికలములైన ఆ హస్తాలనెత్తిజాపి ఏదో అర్థిస్తున్నాడు.

ఆ యాత్రాసమూహం తన దారిన తాను పోతోంది.

కొందరు ఆ వికలాంగుని చూడనైన చూడలేదు. చూచీ - చూడనట్లు వెళ్లిపోయినవారు కొందరు. చూచి అసహ్యించుకొన్నవారు మరి కొందరు. 'అయ్యో-పాపము - భగవానుడు రక్షించుగాక!' అని యింక కొందరు.

'పాపిష్ఠి వెధవలు! పవిత్రయాత్రాస్థలిలో యీ కుష్ఠురోగుల నుండనీయ కూడదు.' అని వేరొక కొందరు.

పలువురు పలువిధాల అనుకొంటూ వారి నారిన వారు పోతున్నారు.

అప్పటినుండీ అమ్మా! అయ్యా! అంటూనే ఉన్నాడా విగతజీవి!

ఆ సమూహంలో ఒక పురాణయువతి ఉత్సవ దర్శనానికి వెళ్లుతూ మార్గంలో యీ యాచకుని చూచినది. ఆమె దయార్ద్రహృదయ. తాను తింటున్న రొట్టెముక్కను ఆ కుష్ఠురోగిముందు విసరినది. ప్రక్కనే కాచుకొనివున్న ఒకకుక్క ఆ రొట్టెను నోట గరచుకొని బరుగెత్తబోయింది. కుష్ఠురోగి తన కఱ్ఱతో అదిలించి ఆ కుక్క తోకను గట్టిగా పట్టుకొని యీడ్చి నోటిలోని రొట్టెముక్కను పెకలించి తీసుకొన్నాడు. ఆ కుక్క వీనిచెయ్యి కరచింది. రక్తం కారుతున్న ఆ చేతితోనే రొట్టెను తింటున్నాడు.

జనసమూహంలో కోలాహలం వినబడ్డది. మఠాధిపతిగారి యేనుగు ఆ గజిబిజిలో కలవరపడి, సమూహం మీదకు రొగపడింది. కెవ్వున కేకలతో స్త్రీలు - శిశువులు బాలలు - యువకులు - వృద్ధులు - ప్రాణరక్షణకై పరుగులెత్తుతున్నారు. గజిబిజిపాటు హెచ్చింది.

ఆ కుష్ఠురోగి లేవలేక చేతికఱ్ఱతో లేచి కుంటు కుంటూ స్త్రీలనూ బాలలనూ తోసుకొంటూ ప్రాణరక్షణకై అందరికన్న ముందు పరుగెత్తుతున్నాడు!!!

అనాథుడు - దరిద్రుడు - రోగి - మృతప్రాయుడు - వృద్ధుడు - ప్రాణాలను గుప్పెటిలో బెట్టుకొని ముందు తోసుకుపోతున్నాడు.

ఏ పరలోకనరకాన్ని - యే కల్పనానరకాన్ని అనుభవించడానికి భయపడి యీ యిహలోక నరకాన్ని అనుభవించడానికి ఉద్యుక్తుడయ్యాడు యీ వృద్ధుడు ???

